క్లుప్తంగా

తోటివారిపై ప్రేమ, ఆదరణ చూపండి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తోటివారిపై ప్రేమ ఆదరణ చూపాలని ఫాదర్ తోట అంతోని సూచించారు. శనివారం స్థానిక తంగెళ్లమూడి బీడీ కాలనీలోని సెయింట్ అంతోని పాఠశాలలో నిర్వహించిన సెమీ క్రిస్టస్ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏసు క్రీస్తు లోకంలో పాపులను రక్షించడానికి ఉద్భవించారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నృత్య నాటిక ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ చుక్క అవినాష్ రాజు, సీహెచ్ కుమార్, యూ. మోజెస్, తోట ఎడ్వర్డ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): శ్రీబసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం ఏలూరు ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని తన క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్‌ను విడుదల చేశారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుల నియామకం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మండల, మున్సిపల్, నగర పంచాయతీ, క్లస్టర్‌ల యువజన విభాగ అధ్యక్షులను శనివారం నియమించారు. ఏలూరు క్లస్టర్-1, 2, 3 అధ్యక్షులుగా జిజ్జువరపు రమేష్, కలవకొల్లు సాంబ, ఈదువల్లి పవన్‌లను నియమిస్తూ తాడేపల్లిలోని పార్టీ కేంద్రం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఘనంగా సెమీ క్రిస్మస్


కేక్ కట్ చేస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు (టూటౌన్): స్థానిక పత్తేబాద లోని రెడ్ క్రాస్ ఏఎన్‌ఎం నర్సింగ్ మహిళా కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ మొత్తం ప్రపంచానికి ఆనందం, శాంతిని తెస్తుందన్నారు. విద్యార్థినిలందరూ నర్సింగ్ శిక్షణ అనంతరం సేవా భావంతో పని చేయాలని సూచించారు. విద్యార్థినులకు బహుమతులు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ నర్సింగ్ కళాశాల చైర్ పర్సన్ బి.పద్మజ వాణి, డాక్టర్ నవ్య కళ, వై.ఉమారాణి, ఆర్ కమలి, కళాశాల అధ్యాపకులు జి.జ్ఞానవేణి, ఎ.ప్రియాంక, సీహెచ్ అనూష, ఎ.సూర్యనారాయణ, ఎం.యశోద తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

ఏలూరు (టూటౌన్): మధ్యాహ్న భోజన కార్మికులను అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించాలని, 2022 పెండింగ్ జీతాలు, మెస్ చార్జీలు విడుదల చేయాలని కోరుతూ డీఈఓ పి.శ్యాంసుందర్‌కు ఏపీటీయూసీ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

- రూ.9 కోట్ల పనులు పూర్తి
- మరో రూ.25 కోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని


దొండపాడు పరివర్తన్ ఆశ్రమంలో చిన్నారులతో ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అన్ని పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. పనుల ప్రగతిపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన శనివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ, అమృత్ 2.0 నిధులతో చేపట్టిన పనులు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించిన పనులపై నాని అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో రూ.9 కోట్లు పనులు చేపట్టి పూర్తి చేశామని, రూ.6 కోట్లు బిల్లులు చెల్లించామని చెప్పారు. మరో రూ.25 కోట్ల అంచనాలతో పనుల ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపి అనుమతి తీసుకోనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులకు మంజూరైన రూ.2 కోట్ల పనులలో రూ.1.80 కోట్లు పనులు పూర్తి చేశామన్నారు. నగరంలో చేపట్టిన 12 కమ్యూనిటీ హాల్స్ పూర్తి చేయడానికి ఇంకా అవసరమైన రూ.86 లక్షల నిధులు నగరపాలక సంస్థ నుంచి చెల్లించనున్నట్టు చెప్పారు. ఈ కమ్యూనిటీ హాల్సును జనవరి నెలాఖరునాటికి పూర్తి చేసి ప్రారంభించాలనినాని ఆదేశించారు. మంచినీటి చెరువుల ఆధునీకరణకు ప్రతిపాదనలు తయారు చేస్తే ఇడా నుంచి మంజూరు చేస్తామన్నారు. ఈ సమీక్షలో మేయర్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు,నూకపెయ్యి సుధీర్ బాబు, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛంద సంస్థ సేవలను నిరంతరాయంగా కొనసాగించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల నాని కొనియాడారు. దొండపాడులోని పరివర్తన్ పాఠశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో నాని పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్లుగా పరివర్తన్ పాఠశాలకు తన వంతు సాయం అందిస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులోనూ సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఎస్‌పీ రెడ్డి దంపతులను నాని సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ పి.శ్యాంసుందర్, డిప్యూటీ కలెక్టర్ పి.రాకడ మణి, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, రిటైర్డ్ ఏడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నృత్యోత్సవాలు




ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సాంస్కృతిక సంస్థ అభినయ నృత్య భారతి 28వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన నృత్యోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శివగోపాల్ లునాని, బ్రిజ్ గోపాల్ లునాని స్మారక జాతీయ నృత్యోత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ స్థాయి నృత్య కళాకారులు విభిన్న నృత్య అంశాలను ప్రదర్శించారు. వరంగల్‌కు చెందిన బి.తేజస్విని పేరిణి లాస్యం, దేవీ కైవారం, తహన విన్యాసాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఏలూరుకు చెందిన ఎస్ కావ్య సిద్ధిక కూచిపూడి నృత్యాంశంలో రామాయణ శబ్దం ప్రదర్శించి ఆకట్టుకుంది. సూర్యాపేటకు చెందిన సాయికుమార్, సంతోష్ కుమార్ సోదరులు పేరిణి నాట్యం, హైదరాబాద్‌కు చెందిన కె.రితిక కూచిపూడి శైలిలో మండోదరి శబ్దం, హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ వెంకట్, చార్మిళా వెంకట్ కూచిపూడి నృత్యం, సంయజ్ కుమార్ జోషి కథక్ నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా దామెర రంగారావు లయనిజం, అడుసుమిల్లి నిర్మల విద్య, వైద్యం, రావూరి సూయజ్ మహిళా శిశు సంక్షేమం, సుదర్శనం దుర్గబాబు సామాజిక, ఆధ్యాత్మిక రంగం, ఎ.పార్వతీ రామచంద్రన్ నాట్యరంగంలకు సేవా తపస్వి పురస్కారాలిచ్చి సన్మానించారు. తొలుత కానాల గురుమూర్తి, వెంకట నారాయణమ్మ స్మారక జాతీయ స్థాయి కూచిపూడి బృంద నృత్య పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు నృత్య కళాకారులు పోటీపడ్డారు. కార్యక్రమాలను అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డి.మేమసుందర్ పర్యవేక్షించారు.

ఉత్తర ద్వార దర్శనం.. భక్తజన సంద్రం


ఆర్‌ఆర్‌పేటలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పూజ చేస్తున్న మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, విశేషాలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరం శనివారం గోవింద నామ స్మరణతో మార్మోగింది. మార్గశిర శుద్ధ ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) పర్వదినం సందర్భంగా నగరంలోని పలు వైష్ణవ క్షేత్రాల్లో స్వామి వార్ల ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు తెల్లవారుజామున నుంచి బారులు తీరారు. స్వామి వార్లకు విశేష అలంకరణ చేశారు. ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రతినిధులు దుశ్శాలువాలతో సత్కరించి స్వామి ప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కిలారపు శ్రీనివాసరావు, ఈఓ నాగం సన్యాసిరావు తదితరులు పర్యవేక్షించారు. అగ్రహారం భూనీళా సమేత జనార్ధన స్వామి దేవస్థానంలో ఉదయం నుంచి భక్తులు వైకుంఠద్వార దర్శనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి శ్రీ మత్స్యావతార అలంకరణ చేశారు. కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. పవర్‌పేట వాసుదేవాలయంలో వైకుంఠఏకాదశి పూజలు చేశారు. స్వామి వారు జగన్మోహిని అలంకరణలో భక్తులకు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బధిరులకు సేవ చేయడం అభినందనీయం


పరివర్తన పాఠశాల రజతోత్సవ వేడుకలో పాల్గొన్న ఎంపీ శ్రీధర్, తపన చౌదరి

ఏలూరు (టూటౌన్): బధిరులకు సేవ చేయడం అభినందనీయమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. స్థానిక దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాల రజతోత్స వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బధిరుల పాఠశాల నిర్వాహకులు చేస్తున్న కృషిని కొనియాడారు. పాఠశాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మరో ముఖ్యఅతిథి తపన చౌదరి మాట్లాడుతూ పరివర్తన్ ద్వారా 25 ఏళ్లలో 750 మంది బదిరులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించిన నిర్వాహకులు, ఉపాధ్యాయులకు తపన ఫౌండేషన్ పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం తరగతి గదులను ఎంపీ శ్రీధర్, తపన చౌదరి దంపతులు ప్రారంభించారు. పాఠశాలలో లిఫ్ట్ నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించిన గారపాటి చౌదరి దంపతులను నిర్వాహకులు సత్కరించారు. పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అమర్చారు. కార్యక్రమంలో గారపాటి రేణుక, పరివర్తన్ వ్యవస్థాపకులు ఎస్ పెద్దిరెడ్డి, డి.శ్రీనివాస రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ కుటుంబానికి పరామర్శ

ఏలూరు (టూటౌన్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీలు శనివారం పరామర్శించారు. ఏలూరు సత్రంపాడులోని సాబ్జీ నివాసానికి వెళ్లి సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాబ్జీ శాసనమండలిలో రాజకీయాలకు అతీతంగా ఎన్నో ప్రజా సమస్యలపై గళమెత్తి వాటి పరిష్కారానికి కృషి చేశారని వారన్నారు. సాబ్జీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

భిక్షకులకు కేశ సంస్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతినగర్ మన్నాచర్చ్‌లో క్రిస్మస్‌ను పురస్కరించుకుని నగరంలోని సుమారు 100 మంది భిక్షకులకు జ్యోతిరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కేశ సంస్కరణతో పాటు స్నానాలు చేయించి, దుస్తుల పంపిణీ, అన్నదానం చేశామని చర్చ్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యం భిక్షకులకు భోజనం ప్యాకెట్లను వారు ఉండే ప్రాంతాల్లో అందజేశామన్నారు. ప్రతి నెలా 200 మంది దివ్యాంగులకు వ్యాక్సిన్ల పంపిణీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. బిషప్ ఎం ఎలీషా రాజు, ఎం. సునీత, ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏలూరులో బాలోత్సవ సందడి


శాస్త్రీయ నృత్య పోటీల్లో చిన్నారి

హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాలు శనివారం అమీనాపేటలోని సురేష్ చంద్ర బాహుగుణ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. బృంద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం తదితర కల్చరల్ పోటీలతోపాటు క్విజ్, తెలుగులో మాట్లాడడం, కథ చెప్పడం, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అకడమిక్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా అంశాల్లో వందలాది మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు.

– సాక్షి, ఫొటో గ్రాఫర్ / ఏలూరు


ఏకపాత్రాభినయం పోటీల్లో పాల్గొన్న చిన్నారి



యోగా పోటీల్లో పాల్గొన్న చిన్నారి

ఎంపీల సస్పెన్షన్ దారుణం

ఏలూరు (టూటౌన్): పార్లమెంటు ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో 146 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏలూరులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలు లేకుండానే బీజేపీ ప్రభుత్వం 18 బిల్లులను ఆమోదింపజేసిందని విమర్శించారు. పార్లమెంటులో దుండగులు ప్రవేశించి దాడి యత్నం చేయడంపై విచారణ కోరితే సస్పెండ్ చేయడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. పార్లమెంటులో దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.